ఆధ్యాత్మిక కేంద్రం.. స్వచ్ఛతకు దూరం

- ప్రధాన రోడ్లపైనే చెత్తాచెదారం
- పుర వీధుల్లో పందుల సంచారం
- దుర్గంధంపై విదేశీ భక్తుల అసహనం



చిత్రావతి నది ఒడ్డున ధ్యాన కేంద్రం వద్ద దుస్థితి..



డస్ట్ బిన్ లేక చిత్రావతి రోడ్డుపై వేసిన వ్యర్థాలు



ముక్కు మూసుకొని మందిరానికి వెళ్తున్న విదేశీ భక్తులు

పుట్టపర్తి రూరల్: ఆధ్యాత్మిక కేంద్రం పుట్టపర్తిలో స్వచ్ఛత కరువైంది. కుళ్లిపోయిన చెత్తాచెదారం నిల్వతో దుర్గంధం వెదజల్లుతోంది. భగవాన్ సత్య సాయి మహా సమాధి దర్శనం, మానసిక ప్రశాంతత కోసం ఖండాంతరాల నుంచి భక్తులు పుట్టపర్తికి వస్తుంటారు. ఆధ్యాత్మిక పరిమళాలు వెల్లివిరియాల్సిన చోట భరించలేని కంపు కొడుతోంది. దీంతో స్థానికులతో పాటు విదేశీయులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. పర్యాటక ప్రదేశాలు, ప్రశాంతి నిలయానికి ముక్కు మూసుకుని భక్తులు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది.

రోడ్లపై చెత్త దిబ్బలు

పట్టణంలో డస్ట్‌బిన్‌ల నిర్వహణ సరిగా లేదు. మున్సిపల్ అధికారులు తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. దీంతో చిత్రావతి రోడ్డు, ప్రశాంతి నిలయం సమీపాన, ప్రధాన రోడ్లపై చెత్తాచెదారం, వ్యర్థాలు దిబ్బలు మారాయి. హోటళ్ల నిర్వాహకులు కుళ్లిన పదార్థాలను రోడ్లపైనే పారబోస్తున్నారు. పరిశుభ్రత, క్రమశిక్షణ విధిగా పాటించే పలువురు విదేశీయులు ఇక్కడి దుర్గంధభరితమైన పరిస్థితిని చూసి 'డర్టీ, బ్యాడ్ స్మెల్' అంటూ మనసు చిన్నబుచ్చుకుంటున్నారు. సత్యసాయి నడయాడిన చిత్రావతి నది ఒడ్డున ఏపీ పర్యాటక శాఖ నెలకొల్పిన ధ్యాన కేంద్రం వద్ద పేరుకుపోయిన దిబ్బల్లో పందులు దొర్లుతూ చెత్తను చిందరవందర చేస్తున్నాయి. అపరిశుభ్ర ప్రదేశాల్లో దోమలు విపరీతంగా వృద్ధి చెంది రోగాలు వ్యాపింపజేస్తున్నాయి.

చర్యలు తీసుకుంటాం



పట్టణ పరిశుభ్రతకు ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. పదేళ్ల క్రితం ఏర్పాటు చేసిన డస్ట్ బిన్‌లు ప్రస్తుత అవసరాలకు సరిపడడం లేదు. మరిన్ని డస్ట్‌బిన్‌ల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాం. ఉన్నవాటిని ప్రజలు సక్రమంగా వినియోగించుకోలేదు. పందుల యజమానులకు రెండుసార్లు నోటీసులు ఇచ్చాం. ఫైనల్ నోటీసు ఇచ్చి పోలీసుల సహకారంతో వాటిని సుదూర ప్రాంతాలకు తరలిస్తాం. ప్లాస్టిక్ కవర్లు వినియోగించే వారికి ఫైన్లు వేస్తాం.

– శివయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్

మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకోండి



కదిరిలో కల్లుగీత కార్మికులతో మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్

కదిరి టౌన్/ ధర్మవరం అర్బన్: కల్లు గీత కార్మికుల కోసం ప్రభుత్వం రిజర్వ్ చేసిన మద్యం దుకాణాలకు ఆసక్తి కలిగిన వారు ఈ నెల ఐదో సాయంత్రం లోపు పుట్టపర్తి ఎక్సైజ్‌స్టేషన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఉమ్మడి అనంతపురం జిల్లా డిప్యూటి కమిషనర్ నాగమద్దయ్య సూచించారు. సోమవారం కదిరి ఎక్సైజ్ స్టేషన్‌లో కల్లు గీత, కల్లు లైసెన్సీ, ఈడిగ/గౌడ కులాల వారితో ఆయన సమావేశం నిర్వహించారు. కదిరి మున్సిపాలిటీ పరిధి, ఎన్‌పీ కుంట మండల పరిధిలో కల్లు గీత కులాలకు రిజర్వ్ చేసిన మద్యం దుకాణాల గురించి వివరించారు. బుధవారం లోపు దరఖాస్తు చేసుకుంటే.. ఏడో తేదీ ఉదయం పది గంటలకు లాటరీ తీసి దుకాణాలు కేటాయిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో అనంతపురం జిల్లా అసిస్టెంట్ కమిషనర్ మునిస్వామి, పుట్టపర్తి అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ నరసింహులు, కదిరి ఎక్సైజ్ సీఐ వీరారెడ్డి, కల్లుగీత కార్మికులు పాల్గొన్నారు. అలాగే ధర్మవరం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన డిప్యూటీ కమిషనర్.. గౌడ కులస్తులతో సమావేశం నిర్వహించారు. గౌడ కులస్తులకు కేటాయించిన మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ చంద్రమణి, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

వ్యాపారాల హక్కుల కోసం వేలం

కదిరి అర్బన్: యర్రదొడ్డి గంగమ్మ ఆలయంలో ఏడాది పాటు వివిధ వ్యాపారాలు నిర్వహించుకునేందుకు సోమవారం వేలం పాట నిర్వహించారు. ఇందులో కూల్‌డ్రింక్స్ దుకాణానికి రూ.3,25,000, గాజుల విక్రయానికి రూ.65,000, ఐస్‌క్రీంల విక్రయానికి రూ.2,65,000తో పాట దక్కించుకున్నారు. ఇక టెంకాయలు, పూజాసామగ్రి, బొమ్మలు, దారాలు, అమ్మవారి చీరలు గత ఏడాదికంటే తక్కువకు పాటపాడడంతో ఈ వేలాలను 12వ తేదీకి వాయిదా వేసినట్లు ఆలయ పర్యవేక్షణాధికారి ప్రసాద్, ఆలయ ఈఓ రవీంద్రరాజు తెలిపారు.

నేడు పేరూరులో సుబ్రహ్మణ్యేశ్వర షష్టి

రామగిరి: మండలంలోని పేరూరులో మంగళవారం సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్టి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకుడు సుబ్బరామప్ప సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించినట్లు పేర్కొన్నారు. సుబ్రహ్మణ్యేశ్వర షష్టికి కంబదూరు, కనగానపల్లి మండలాలతో పాటు కర్ణాటక వాసులు తరలివస్తారని గ్రామస్తులు తెలిపారు.

అర్జీలకు సత్వర పరిష్కారం

బత్తలపల్లి: ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ప్రజలు వివిధ సమస్యలపై అర్జీలు సమర్పించారు. అర్జీలను పరిశీలించి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ స్వర్ణలత, ఎంపీడీఓ నరసింహనాయుడు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ క్రిష్టప్ప, ట్రాన్స్‌కో ఏఈ శివయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ చంద్రమ్మ, ఎంఈఓ చాముండేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండండి

ఓడీచెరువు : గౌనిపల్లిలో ఆదివారం సోమశేఖర్‌రెడ్డి ఇంటిలో భారీ దొంగతనం జరిగిన నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి సూచించారు. సోమవారం గౌనిపల్లిలో గ్రామసభ ఏర్పాటు చేసి చోరీల నివారణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. దుకాణాల్లో పెద్ద మొత్తంలో నగదు ఉంచరాదని, గ్రామస్తులు తమ ఇళ్లల్లో అధిక మొత్తంలో బంగారు, వెండి ఆభరణాలు ఉంచుకోవడం సురక్షితం కాదని తెలిపారు. దుకాణాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఊరికి వెళ్లే వారు పక్కింటి వారికి చెప్పి వెళ్లాలని సూచించారు.

దుకాణాల నిర్వహణకు 6న వేలం

తాడిమర్రి: చిల్లవారిపల్లి సమీపంలోని కాటికోటేశ్వర స్వామి దేవాలయంలో కొబ్బరి కాయల విక్రయం, పూజా సామగ్రి, తలనీలాల సేకరణ, గాజులు, బొమ్మల విక్రయ దుకాణాల నిర్వహణ కోసం ఈ నెల 6న ఉదయం 10 గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వారు రూ.5 వేలు డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఆలయానికి బకాయిలు ఉన్నవారు కానీ, లావాదేవీలు ఉన్న వారు కానీ వేలంలో పాల్గొనరాదని తెలిపారు. వేలం పాట ముగిసిన వెంటనే హెచ్చు పాటదారుని డిపాజిట్ తప్ప తక్కిన వారి డిపాజిట్లు వాపస్ చేస్తామని పేర్కొన్నారు.

భూముల సరిహద్దుపై ఘర్షణ

కదిరి టౌన్: యర్రగుంటపల్లికి చెందిన అంజినమ్మకు ఎన్‌జీఓ కాలనీలో ఉన్న భూమి ఉంది. ఇందులో తమకూ భాగముందంటూ సరిహద్దు రాళ్లను యర్రగుంటపల్లికి చెందిన కొయ్య రాజేంద్ర, అతని తమ్ముడు శ్రీనివాసులు, సూర్యనారాయణ, అమర, శ్రీనివాసులు సోమవారం తొలగించారు. అడ్డుకోబోయిన అంజినమ్మ, ఆమె తల్లిపై దాడి చేసి గాయపరిచారు. దాడిచేసిన ఐదుగురిపైన బాధితులు పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సీఐ వి.నారాయణరెడ్డి తెలిపారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

అమడగూరు: మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ మునెప్ప ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు తప్పకుండా హాజరు కావాలని కోరారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై విచారణ



గ్రామంలో విచారణ చేస్తున్న డీఎస్పీ

గాండ్లపెంట: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కింద నమోదైన కేసును డీఎస్పీ శివనారాయణస్వామి సోమవారం విచారణ చేపట్టారు. మలమీదపల్లి పంచాయతీ బనాన్‌చెరువుపల్లికి చెందిన చలపతినాయుడు జనవరి 31న పశువులను తోలుకెళ్తున్న తనపై అసభ్యకరంగా ప్రవర్తించి, కులం పేరుతో దూషించాడని బనాన్‌చెరువుపల్లి తండాకు చెందిన మేఘన పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కింద కేసు నమోదు చేశారు. దీనిపై కదిరి డీఎస్పీ శివనారాయణస్వామి సోమవారం గ్రామానికి వెళ్లి విచారణ చేశారు. డీఎస్పీ వెంట రూరల్ సీఐ నాగేంద్ర, ఇన్‌చార్జ్ ఎస్‌ఐ వలిబాషా ఉన్నారు.

ట్యాంకర్ ఢీకొని ఎద్దు మృతి

ముదిగుబ్బ: మండల కేంద్రంలోని బీఎస్‌ఎన్‌ఎల్ టవర్ వద్ద సోమవారం తెల్లవారుజామున రైతు చంద్రశేఖర్ ఎద్లబండిపై పొలానికి వెళ్తుండగా పాల ట్యాంకర్ వెనుకనుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో ఒక ఎద్దు సంఘటన స్థలంలోనే మృతి చెందింది. రైతు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. మరో ఎద్దు గాయపడింది. అనంతరం స్థానికులు ఆస్పత్రిక తరలించారు.

అవార్డు గ్రహీతలకు అభినందనలు

కనగానపల్లి: గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవా అవార్డులు అందుకున్న సగ్రమ శిక్ష ఉద్యోగులు సుకన్య(సీఆర్‌ఎంటీ), భాగ్యలక్ష్మి (ఆర్ట్ టీచర్)కు పలువురు అభినందనలు తెలియజేశారు. సోమవారం స్థానిక ఎంఈఓ కార్యాలయంలో ఎంఈఓ అరుణమ్మ ఆధ్వర్యంలో సుకన్య, భాగ్యలక్ష్మిని పూలమాలలు, శాలువాలతో ప్రత్యేకంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీదేవి, ఎంఐఎస్, సీఆర్‌టీలతో పాటు, కార్యాలయ సిబ్బంది, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాగసముద్రం రోడ్డు ప్రారంభం

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని నాగసముద్రం గ్రామానికి నూతనంగా ఏర్పాటు చేసిన రోడ్డును ఎమ్మెల్యే పరిటాల సునీత సోమవారం ప్రారంభించారు. ఎన్‌ఎస్‌గేట్ నుంచి ధర్మవరం వెళ్లే ప్రధాన రహదారి మీదుగా గ్రామంలోకి వెళ్లేందుకు దాదాపు కిలోమీటర్ పొడవునా రోడ్డు నిర్మించినట్లు తెలిపారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



ఎర్రోనిపల్లి పాఠశాలలో విద్యార్థిని పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని ఎర్రోనిపల్లి ప్రాథమిక పాఠశాలలో సోమవారం ఎన్‌ఎస్‌గేట్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్య సిబ్బంది వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. పిల్లల ఎదుగుదల, మానసిక సమస్యలు, అంగవైకల్యంతో బాధపడుతున్న వారిని గుర్తించి మెరుగైన వైద్యం కోసం జిల్లా ఆసుపత్రికి పంపడం జరుగుతుందని వైద్యులు తెలిపారు. ఆటలు ఆడుకునే సమయంలో పిల్లలు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అనారోగ్య సమస్యలు వచ్చిన వెంటనే సమీపంలోని ప్రభుత్వాసుపత్రికి వెళ్లి వైద్యం చేయించుకోవాలన్నారు. కంటి సమస్యలు వచ్చినపుడు నాటు వైద్యం చేయించుకోకుండా డాక్టర్‌ను సంప్రదించాలన్నారు.

కందిలో పంటకోత ప్రయోగాలు



కంది పంటలో దిగుబడి అంచనా వేస్తున్న అధికారులు

బత్తలపల్లి: ఖరీఫ్‌లో వర్షాధారంగా సాగు చేసిన కందిలో పంటల దిగుబడి అంచనా కోసం సోమవారం మండలంలోని ఈదుల ముష్టూరు, సంగాల, దంపెట్ల గ్రామాల్లో ఏఎస్‌ఓ డాక్టర్ లక్ష్మీనరసింహశర్మ ఆధ్వర్యంలో పంటకోత ప్రయోగాలు నిర్వహించారు. ఆయా గ్రామాలలో ఏఎస్‌ఓతో పాటు ఏఈఓలు ఉపేంద్రరెడ్డి, శ్రీనివాసులు పర్యవేక్షణలో వీఏఏలు నిఖితకుమారి, సునీత, ఎంపీఈఓ రవి ప్రయోగాలు చేపట్టారు. కార్యక్రమంలో ఇన్సూరెన్స్ మండల కోఆర్డినేటర్ ఎర్రిస్వామి, శామ్యూల్, కృష్ణమూర్తి, మంజునాథ్, మహేష్ పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు తరలిరండి



పోస్టర్లను విడుదల చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

చెన్నేకొత్తపల్లి: ఈనెల 7వ తేదీన హైదరాబాద్‌లో జరిగే లక్ష డప్పులు–వేల గొంతులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు. సోమవారం మండల కేంద్రంలోని ఓబుళ లక్ష్మీనరసింహ స్వామి దేవాలయం వద్ద పోస్టర్లు విడుదల చేశారు. హైదరాబాద్‌లో ఎల్‌బీ స్టేడియం నుంచి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వరకు మాదిగల భారీ సాంస్కృతిక ప్రదర్శన జరుగుతుంద పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు దబ్బల శ్రీరాములు, గంగాధర్, సీఎం నరసింహులు, ఆదిశేషయ్య, ముత్యాలు, చంద్ర, ఓబులేసు, నాగేంద్ర, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

బాలుడిపై పోక్సో కేసు

ధర్మవరం అర్బన్: పట్టణంలో ఇంటర్ చదువుతున్న బాలికను ప్రేమిస్తున్నానంటూ ఓ బాలుడు వెంట పడుతున్నాడు. ఏకంగా కళాశాలకు వెళ్లి వేధిస్తుండటంతో బాలిక తల్లిదండ్రులు టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బాలుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ రెడ్డప్ప సోమవారం తెలిపారు.

స్ప్రింక్లర్లు, పైపులు ధ్వంసం

తాడిమర్రి: మర్రిమాకులపల్లిలో మల్లాగుండ్ల చిన్న గంగన్న పొలంలో స్ప్రింక్లర్లు, పైపులను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. సోమవారం రైతు వేరుశనగ పంటకు నీరు పెట్టడానికి వెళ్లాడు. అప్పటికే అక్కడ 30 పైపులు, 12 స్ప్రింక్లర్లను ధ్వంసమై ఉండటం గుర్తించాడు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ కృష్ణవేణి, ఏఎస్‌ఐ సూర్యనారాయణరాజు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

తాగుబోతు భర్తపై కేసు

కదిరి టౌన్: తాగుబోతు భర్తపై ఓ మహిళ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పట్టణంలోని ఆర్‌ఎస్‌రోడ్డులో ఇళ్లల్లో పనిచేసి జీవనం సాగించే పులి జ్యోతి, ఫిరోజ్‌ఖాన్ దంపతులు. ఫిరోజ్‌ఖాన్ రోజూ తాగొచ్చి ఏదో ఒక సాకుతో గొడవ పడుతూ.. వేధిస్తున్నాడని భార్య సోమవారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సీఐ తెలిపారు.

క్లుప్తంగా

ప్రజా సమస్యలు వెంటనే పరిష్కరించాలి



అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ మహేష్

ధర్మవరం అర్బన్: ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆర్డీఓ మహేష్ అధికారులను ఆదేశించారు. ఆర్డీఓ కార్యాలయ సమావేశ భవనంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల రెవెన్యూ అధికారులతో కలిసి ఆయన ప్రజల నుంచి అర్జీలు, ఫిర్యాదులను స్వీకరించారు. సాధ్యమైనంత త్వరగా సమస్యలను పరిష్కరిస్తామని ఆర్డీఓ పేర్కొన్నారు.

అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు



సన్మాన గ్రహీతలతో ఎంపీపీ రాము, ఎంపీడీఓ అంజినప్ప, సిబ్బంది

ఎన్‌పీకుంట: అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు లభిస్తుందని ఎంపీపీ ఈటె రాము పేర్కొన్నారు. గణతంత్ర దినోత్సవం రోజు కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ అధికారులుగా ప్రశంసాపత్రాలు అందుకున్న వ్యవసాయ అధికారి లోకేశ్వరరెడ్డి, వీఆర్‌ఓ అనూష, పంచాయతీ కార్యదర్శి రెడ్డిభాస్కర్, ఉపాధిహామీ టీఏ శరత్, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ మహమ్మద్‌షఫీలకు సోమవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ ఆధ్వర్యంలో ఎంపీపీ తదితరులు అధికారులను సత్కరించి.. శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ చంద్రశేఖర్, టైపిస్ట్ జకీవుల్లా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నరసమ్మ, మౌలాబీ, సచివాలయ, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌టీఏ క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ



క్యాలెండర్, డైరీ ఆవిష్కరిస్తున్న ఎంఈఓలు

ఎన్‌పీకుంట: మండల విద్యాధికారి కార్యాలయంలో సోమవారం ఎంఈఓలు గోపాల్‌నాయక్, సుబ్బిరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌టీఏ నూతన క్యాలెండర్, డైరీని ఆవిష్కరించారు. వైఎస్సార్‌టీఏ జిల్లా ప్రధానకార్యదర్శి ఇంద్రప్రసాద్, నాయకులు గంగాధర్‌రెడ్డి, శివయ్య, ఆంజనేయులునాయక్ మాట్లాడుతూ 117 జీఓ రద్దు చేయడం ద్వారా పాఠశాలల సంఖ్య తగ్గకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపునకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ సూచించారు. కార్యక్రమంలో నాయకులు వెంకటరామిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, వెంకటరమణారెడ్డి తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్షయ నివారణే లక్ష్యం



ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

కదిరి టౌన్: క్షయ నివారణే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు క్షయ విభాగం అధికారులు అధికారులు వెల్లడించారు. సోమవారం కదిరిలోని గాంధీనగర్ ఒకటో క్రాస్ అంగన్‌వాడీ కేంద్రం వద్ద క్షయ వ్యాధిపై వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి.. స్థానికులకు అవగాహన కల్పించారు. ఇదివరకే ఇంటింటా సర్వే చేపట్టి క్షయ లక్షణాలు ఉన్న వారిని గుర్తించి.. నివారణకు సంబంధించిన మందులు అందజేశామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో క్షయ విభాగం సూపర్‌వైజర్ శ్రీనివాసులు, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

మల్బరీ సాగు చేస్తే సబ్సిడీలు



మల్బరీ మొక్కల సాగు పరిశీలిస్తున్న అధికారి

తలుపుల : మల్బరీ సాగు చేసే సబ్సిడీలు పొందాలని కదిరి పట్టు పరిశ్రమ శాఖ అధికారి మస్తాన్ రైతులకు సూచించారు. మండలంలోని తూపల్లి, ఉబ్బరవాండ్లపల్లి, గ్రామాల్లో రైతులు సాగు చేసిన మల్బరీ మొక్కలను ఆయన పరిశీలించి, తగు సూచనలు చేశారు. ఇప్పుడిప్పుడే రైతులు మల్బరీ సాగుపై ఆసక్తి కనబరుస్తున్నారన్నారు. మల్బరీ సాగు చేసే రైతులకు షెడ్డు మొదలుకొని, మొక్కలు, ఎరువులు, మందులు, ఇతర పరికరాలను సబ్సిడీపై అందజేస్తామన్నారు. కార్యక్రమంలో మల్బరీ సహాయకులు రమణ, సీఎస్‌ఏ యాసిన్, రైతులు పాల్గొన్నారు.

గడువు పొడిగించండి



ఆర్డీఓకు వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

కదిరి అర్బన్: బీసీ, ఇతర కులాలకు ప్రభుత్వం సబ్సిడీపై అందించే రుణాలకు దరఖాస్తు చేసుకునే గడువును ఈ నెల 15 వరకు పొడిగించాలని కదిరి డివిజన్ నాయీబ్రాహ్మణ, రజక సంఘం, అంబేడ్కర్ సేవా సమితి నాయకులు కోరారు. ఈ మేరకు వారు ఆర్డీఓ వెంకట సన్యాసి శర్మకు సోమవారం వినతిపత్రం సమర్పించారు. గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన లేక రుణాలకు దరఖాస్తు చేసుకునేందుకు కావాల్సి ధ్రువపత్రాలు సమకూర్చుకోవడానికి సమయం చాలడం లేదన్నారు. ఈ నెల ఏడో తేదీ దరఖాస్తు చేసుకునేందుకు ఆఖరు తేదీగా ఉందని, దీన్ని పొడిగించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు హరిప్రసాద్, రమణ, శ్రీనివాసులు, మునికుమార్, గంగన్న తదితరులు పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి తోడ్పాటునందించండి



సమావేశంలో పాల్గొన్న అధికారులు

తనకల్లు: అధికారులు సమన్వయంతో పనిచేస్తూ మండల అభివృద్ధికి తోడ్పాటునందించాలని ఎంపీపీ వైవీ కౌసల్య కోరారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపీపీ మాట్లాడుతూ రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకొని గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. భూ సమస్యలు వీఆర్వోల దృష్టికి తీసుకొస్తే విచారణ చేసి సత్వరం పరిష్కరించనున్నట్లు తహసీల్దార్ శోభ సువర్ణమ్మ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రెడ్డెప్ప, ఎంఈఓ కళ్యాణి, పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

వేరుశనగ పంట పరిశీలన

సాక్షి ఎఫెక్ట్..

నల్లమాడ: రబీలో సాగు చేసిన వేరుశనగ పంట తెగుళ్లు చుట్టుముట్టాయి. 'వేరుశనగకు తెగుళ్ల బెడద' శీర్షికన సోమవారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి మండల వ్యవసాయాధికారి శంకర్‌నాయక్ స్పందించారు. సోమవారం తమ సిబ్బందితో కలసి మండల కేంద్రంలోని రైతు జిక్రియా సాగు చేసిన వేరుశనగ పంటను పరిశీలించారు. తెగుళ్లను పరిశీలించి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఎంపీఈఓ రాధమ్మ, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యలపై వినతులు



వినతిపత్రం అందజేస్తున్న దివ్యాంగులు

ఓడీచెరువు : దివ్యాంగుల సమస్యలపై సోమవారం తహసీల్దారు అనంతాచారి, ఎంపీడీఓ రాబర్ట్ విల్సన్‌కు ఆర్డీటీ జీఓ గీత, వికలాంగుల సంఘం గంగాదేవి ఆధ్వర్యంలో వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. మండల కేంద్రంలో దివ్యాంగుల భవనం కోసం కేటాయించిన స్థలానికి కొలతలు వేయించాలని తహసీల్దార్‌కు విజ్ఞప్తి చేశారు. ఉపాధి హామీ కింద దివ్యాంగులకు ప్రత్యేక పనులు కేటాయిస్తూ.. కొలతల్లో మినహాయింపు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో దివ్యాంగులు సరస్వతి, హేమావతి, తిరుపతి, ఆంజనేయులు పాల్గొన్నారు.

శివాలయాల్లో ప్రత్యేక పూజలు

తాడిమర్రి: మండలంలోని చిల్లవారిపల్లి కాటికోటేశ్వర క్షేత్రం, పురాతన శివాలయం, భైరవేశ్వర ఆలయం, కునుకుంట్ల, చిల్లకొండయ్యపల్లి శివాలయాల్లో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు.

గ్రామీణ రోడ్లు.. అడుగడుగునా గతుకులు





కొత్తచెరువు సమీపంలో ఛిద్రమైన పెనుకొండ-కొత్తచెరువు రోడ్డు, లోచర్ల వద్ద ఇలా...



లింగారెడ్డిపల్లి క్రాస్ వద్ద దెబ్బతిన్న రోడ్డు

పుట్టపర్తి అర్బన్: సంక్రాంతి నాటికి రోడ్ల ప్యాచ్‌వర్క్‌లు పూర్తి చేస్తామన్న కూటమి సర్కారు హామీ పూర్తిస్థాయిలో నెరవేరలేదు. చాలాచోట్ల రోడ్లు దెబ్బతిని రాకపోకలకు అసౌకర్యంగా అలానే ఉన్నాయి. కొత్తచెరువు మండలంలోని పలు పల్లెలను పరిశీలిస్తే దెబ్బతిన్న రోడ్లు కనిపించాయి. గత ఏడాది కురిసిన వర్షాలకు చాలావరకు రోడ్లు కోతకు గురై ఛిద్రమయ్యాయి. ఆర్టీసీ, కియా తదితర ప్రైవేట్ వాహనాలు అధికంగా రాకపోకలు సాగించే కొత్తచెరువు–పెనుకొండ రోడ్డు పొడవునా గుంతలు పడ్డాయి. లోచర్ల చెరువు కట్ట కింది భాగంలో సుమారు రెండు కిలోమీటర్ల మేర గతుకులే దర్శనమిస్తాయి. భైరాపురం ప్రధాన రోడ్డుతో పాటు సాయి నగర్ క్రాస్, లింగారెడ్డిపల్లి క్రాస్, లోచర్ల పాఠశాల ముందర, ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఎన్నో గుంతలు ప్రమాదకరంగా ఉన్నాయి.



సాయినగర్ క్రాస్ వద్ద అధ్వానంగా ఉన్న రోడ్డు

ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి ఓసారి ఈ రోడ్లను పరిశీలించి మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.